పీయూలో ఉట్టిపడిన తెలుగుదనం

- పట్టు పంచె, పరికిణిలో యువతీ, యువకుల కోలాహలం
- మామిడి తోరణాలు, ముగ్గులతో విద్యాలయానికి సరికొత్త శోభ
- షడ్రుచులు పంచుకొని శుభాకాంక్షలు తెలుపుతున్న విద్యార్థులు, అధ్యాపకులు

ఉగాది వేడుకల్లో మాట్లాడుతున్న గుంత లక్ష్మణ్

మహ బూబ్‌నగర్ కలెక్టరేట్, మార్చి 27: ఉగాది వేడుకల్లో పాలమూరు విశ్వవిద్యాలయ లోగిళ్లు కళకళలా డాయి ఎటు చూసినా పచ్చని తోరణాలు.. రంగురంగుల పూలతో అలంకరించిన విభాగాల ముఖద్వారాలు.. సంస్కృతి, సంప్రదాయ దుస్తులతో విద్యార్థిని, విద్యార్థులు.. అధ్యాపకులు.. విభాగా ధిపతులు.. సంతోషాల హరివిల్లులా విశ్వవిద్యాలయంలో గురువారం గ్రామీణ ప్రాంతాల్లోని పండగ వాతావరణం కళ్లకు కట్టింది. షడ్రుచుల (తీపి, కారం, ఉప్పు, వగరు, చేదు, పులుపు)తో తయారు చేసిన ఉగాది పచ్చడితో సంప్రదా యన్ని పాటిస్తూ.. కొత్తదనంతో మామిడి పులిహోర, తీపి బక్షాలు పంచుతూ ఆనందాన్ని ఆస్వాదిస్తూ తెలుగు వారి తొలి పండగను ఘనంగా జరుపుకున్నారు.

పాలమూరు యూనివర్సిటీ లైబ్రరీ ఆడిటోరియంలో గురువారం నిర్వహించిన విశ్వవసు నామ సంవత్సరం ఉగాది–2025 వేడుకలను పీయూ వీసీ శ్రీనివాస్, అఖిల భారత సహ సంఘటన కార్యదర్శి గుంత లక్ష్మణ్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి, చదువుల తల్లి సరస్వతికి పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. ఆది మానవుడి నుంచి ఆధునిక మానవుడి జీవితానికి అన్ని వేళలా ఆయువు పోస్తున్న ప్రకృతి ప్రసాదించిన షడ్రుచుల సమ్మేళనమే ఉగాది అని పేర్కొన్నారు.


ఉగాది పచ్చడితో విద్యార్థినులు


సంప్రదాయ పిండివంటలు, పులిహోర ఆరగిస్తున్న విద్యార్థినులు

పీయూ ఎదుట వేసిన ముగ్గు వద్ద సంప్రదాయ దుస్తులతో విద్యార్థులు

విశిష్ట అతిథి గుంత లక్ష్మణ్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి సంప్రదాయాలను గౌరవించి భవిష్యత్‌తరాలకు అందించాలన్నారు. కార్యక్రమాల్లో పీయూ ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ మధుసూదన్ రెడ్డి పరీక్షల నిర్వహణ అధికారి రాజ్‌కుమార్, తెలుగు శాఖ అధ్యక్షురాలు డా.సంధ్యారాణి, తెలుగు విభాగం అధ్యాపకులు డా.రవీందర్ గౌడ్ రాఘవేంద్రరావు, తిరుపతయ్య, పీజీ, ఫార్మసీ, కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, పీయూ బోధనేతర సిబ్బంది, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్‌జీ పాల్గొన్నారు.

మాన్యువల్ స్కావెంజింగ్‌పై సర్వే

- కలెక్టర్ విజయేందిరబోయి

సూచనలు చేస్తున్న కలెక్టర్ విజయేందిరబోయి

మహ బూబ్‌నగర్ కలెక్టరేట్, మార్చి 27: మాన్యువల్ స్కావెంజింగ్‌పై కేంద్రం ఇచ్చిన సూచనలు పాటిస్తూ, పారదర్శకంగా గోప్యతకు తావులేకుండా స్కావెంజింగ్ సర్వే చేపట్టాలని కలెక్టర్ విజయేందిర బోయిఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి మాన్యువల్ స్కావెంజింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా ఎక్కడైనా మాన్యువల్ స్కావెంజింగ్ ఇంకా ఎక్కడైనా జరుగుతుందా.? అని తెలుసుకునేందుకు రాష్ట్ర, జిల్లాస్థాయిలో సర్వే కమిటీలను కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సంబంధిత అధికారులు సర్వే నిర్వహించి నమస్తే స్కీమ్, నమస్తే పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్ మోహన్‌రావు, ఎస్సీ డీడీ సుదర్శన్, సీపీవో రవీందర్, డీపీవో పార్థసారథి, మహ బూబ్‌నగర్, భూత్పూర్, జడ్చర్ల, దేవరకద్ర మున్సిపల్ కమిషనర్లు, సీఐటీయూ నాయకుడు వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటీఎస్ సద్వినియోగం చేసుకోవాలి

వన్‌టైం సెటిల్ మెంట్(ఓటీఎస్) స్కీంను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్, నగర పాలక సంస్థ స్పెషల్ ఆఫీసర్ శివేంద్రప్రతాప్ కోరారు. గురువారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి చెందిన ఆస్తి పన్ను బకాయిల మొత్తాన్ని చెల్లిస్తే ఆస్తిపన్నుపై 90శాతం పేరుకుపోయిన బకాయి వడ్డీని మాఫీ చేస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఈనెల 31 వరకు మాత్రమే వర్తిస్తుందన్నారు.

సృజనాత్మకతను పెంచే కార్యక్రమాలు చేపట్టాలి

- పేట కలెక్టర్ సిక్తా పట్నాయక్

విద్యార్థుల ప్రదర్శనలను తిలకిస్తున్న కలెక్టర్ సిక్తాపట్నాయక్

నారాయణ పేట, మార్చి 27: విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచే కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని శ్రీగార్డెన్ ఫంక్షన్ హల్‌లో జిల్లావ్యాప్తంగా ఎంపిక చేయబడ్డ ప్రాథమిక పాఠశాలల నైపుణ్యాల ప్రదర్శనకు కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరాయ్యారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక పాఠశాలల్లో అమలవుతున్న కార్యక్రమాలకు అనుగుణంగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించారు. విద్యార్థులను ప్రశ్నిస్తూ, సమాధానాలు రాబట్టి అభినందించారు. చింతల్ దిన్నె పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన మౌఖిక గణితానికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఏడాదిపాటు నిర్వహించిన కార్యక్రమాలను ఈ విధంగా ఘనమైన ముగింపు కార్యక్రమం చేయడం బాగుందని, ఇదే స్ఫూర్తితో రానున్న విద్యాసంవత్సరం మరింత మెరుగ్గా పనిచేయాలన్నారు. విద్యాశాఖపై ప్రత్యేక దృష్టి ఉన్న కారణంగానే మన జిల్లాలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ బోధన సాగుతుందని, ఇలాంటి మరెన్నో వినూత్న కార్యక్రమాలు చేయాలని, అందుకు తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. పిల్లల నైపుణ్యాలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తున్న ఉపాధ్యాయులు, అలోకిత్ ఫౌండేషన్ సభ్యులను అభినందించారు. అంతకుముందు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌తో కలిసి కలెక్టర్ వీక్షించారు. కార్యక్రమంలో డీఈవో గోవిందరాజులు, ఏఎమ్‌వో విద్యాసాగర్, ఎంఈవోలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, చిన్నారులు పాల్గొన్నారు.

ప్రాచీన కళలను కాపాడాలి

- సంగీత నాటక అకాడమీ మాజీ చైర్మన్ శివకుమార్
- రంగస్థల నటులు, కళాకారులకు సన్మానం

కళాకారులను సన్మానిస్తున్న బాద్మి శివకుమార్

జడ్చర్లటౌన్, మార్చి27: ప్రాచీన కళలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిదని మాజీ సంగీత, నాటక అకాడమీ చైర్మన్ బాద్మి శివకుమార్ అన్నారు. ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా జడ్చర్లలోని చంద్రాగార్డెన్ ఫంక్షన్ హాల్‌లో శ్రీనవజ్యోతి కళానిలయం ఆధ్వర్యంలో రంగస్థల నటులు, కళాకారులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ సంగీత, నాటక అకాడమీ మాజీ చైర్మన్ బాద్మి మాట్లాడారు. నాటక రంగం పరిరక్షణకు కృషిచేయాలని పిలుపునిచ్చారు. సంస్కృతి, సంప్రదాయాల తోపాటు సామాజిక అంశాలపై ప్రజలను చైతన్యపరుస్తున్న కళాకారులకు ప్రభుత్వం ప్రోత్సాహం ఇవ్వాలని కోరారు. అలాగే కళాకారులకు గౌరవ వేతనం ఇవ్వడంతో ఆర్థికసాయం అందించాలన్నారు. ఈ సందర్భంగా సీనియర్ కళాకారులను శాలువాలతో సత్కరించారు. అదేవిధంగా మండలంలోని బూర్గుపల్లిలో శ్రీకృష్ణ కళామండలి ఆధ్వర్యంలో కళాకారులను సన్మానించారు. కార్యక్రమంలో అయ్యన్న, దామోదర్, కృష్ణ, నర్సింహులు, ప్రభు, రాధాకృష్ణ, సుదర్శన్, దత్తుకుమార్, ఉమ్మెంతల మహేశ్వర్, జనార్దన్, కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి, శంకరయ్య, బైకని రాములు, రఘురాములు, కృష్ణయాదవ్, గోరంట్ల మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

పేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడి ఎన్నిక

నారాయణ పేట, మార్చి 27: పేట బార్ అసోసియేషన్‌కు గురువారం నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా దామోదర్‌గౌడ్ ఎన్నిక య్యారు. పేట బార్ అసోసియేషన్‌కు 2025–26కు ఏడాది సంబంధించి అధ్యక్ష స్థానానికి దామోదర్ గౌడ్, రఘువీర్ యాదవ్ నామినేషన్లు వేశారు. మొత్తం 65 ఓట్లకుగాను రఘువీర్ యాదవ్‌కు 11ఓట్లు, దామోదర్ గౌడ్‌కు 54 ఓట్లు వచ్చాయి. దీంతో దామోదర్‌గౌడ్ 34 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. దామోదర్‌గౌడ్ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి కృష్ణగౌడ్ తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

అర్జెంటుగా కావలెను

★అర్జెంటుగా సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. వసతి సౌకర్యం కలదు. మంచి జీతం కలదు. సంప్రదించండి: 9392663777, 9246663777.
NT-329238

ప్రకటన

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748

ఎంవీఎస్ కళాశాలలో విద్యార్థుల సహకార క్లబ్

మహ బూబ్‌నగర్ కలెక్టరేట్, మార్చి 27: మహ బూబ్‌నగర్ ఎంవీఎస్ ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ డిగ్రీ కళాశాలలో సహకార క్లబ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా సహకార అధికారి శంకరాచారి తెలిపారు. గురువారం ఆ కళాశాలలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంతర్జాతీయ సహకార సంవత్సరం 2025లో భాగంగా సహకార సంఘాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు మొదటిసారి ఎంవీఎస్ కళాశాల విద్యార్థులతో సహకార క్లబ్‌ను ప్రారంభించారు. సమావేశంలో సహకార ఆడిట్ అధికారి టైటస్ పాల్, ప్రిన్సిపాల్ పద్మావతి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి నర్సింహులు, సహకార అధికారులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ భార్యపై దాడి

ధన్వాడ, మార్చి 27: తన సొంత పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె నిర్మిస్తుంటే గ్రామానికి చెందిన ముగ్గురు మహిళలు తనను కులం పేరుతో దూషించి దాడి చేశారని చర్లపల్లి మాజీ సర్పంచ్ రాములు భార్య మొగులమ్మ గురువారం ధన్వాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన మణెమ్మ, భీమమ్మ, నీరజ దాడిచేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

బాలానగర్, మార్చి 27: మండల కేంద్రానికి చెందిన జహంగీర్ (57) ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్లు ఎస్సై లెనిన్ తెలిపారు. గురువారం ఉదయం పది గంటల ప్రాంతంలో ఇంట్లోంచి బయటకు వెళ్లిన ఆయన తాగిన మత్తులో స్థానిక సంతబజారులో కింద పడిపోయాడని, కుటుంబ సభ్యులు వైద్యుడికి చూపించారని తెలిపారు. సాయంత్రం వరకు ఆరోగ్యంగానే ఉన్న ఆయన రాత్రి ఏడు గంటల ప్రాంతంలో హఠాత్తుగా మృతిచెందాడని తెలిపారు. మృతుడి భార్య జహంగీర్‌బీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డీసీఎంను ఢీ కొట్టిన బొలేరో

మూసాపేట(అడ్డాకుల), మార్చి 27: రోడ్డుపై నిలిపిన డీసీఎంను వెనుక నుంచి వచ్చిన బొలేరో ఢీ కొట్టిన ఘటనలో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. అడ్డాకుల ఎస్సై శ్రీనివాసులు కథనం ప్రకారం.. బుధవారం రాత్రి కర్నూల్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న డీసీఎంను అడ్డాకుల జాతీయ రహదారి వంతెనపై నిలిపారు. కర్నూల్ నుంచి హైదరాబాద్‌కు చేపల లోడుతో వెళ్తున్న బొలేరో వెనుక నుంచి వచ్చి డీసీఎంను ఢీ కొట్టింది. దీంతో అందులో ఉన్న డ్రైవర్ పుడ్వీరాజ్‌కు గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదుతో ప్రమాదానికి కారణమైన డీసీఎం డ్రైవర్ బాలుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

లారీని ఢీకొన్న ప్రైవేట్ బస్సు

మరికల్, మార్చి 27: ఆగి ఉన్న లారీని ప్రైవేట్ బస్సు ఢీ కొట్టడంతో లారీ డ్రైవర్‌కు గాయాలైన ఘటన మరికల్ మండలంలోని ఎలిగండ్లలో చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. ఎలిగండ్ల స్టేజీ వద్ద ఆగి ఉన్న లారీని కర్ణాటకు చెందిన ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఢీకొట్టడంతో లారీ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే 108లో మహబూబ్‌నగర్‌కు తరలించారు. ఈ విషయమై ప్రైవేట్ బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు మరికల్ పోలీసులు తెలిపారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

మరికల్, మార్చి 27: వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని జిల్లా వాల్మీకి బోయ సంఘం కోశాధికారి నర్సింహులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాజంలో వెనుకబడిన వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చి న్యాయం చేయాలని కోరారు. అనంతరం వాల్మీకి సంఘం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆంజనేయులు(మరికల్), ప్రధానకార్యదర్శిగా నాగరాజ్(ఎక్లాస్‌పూర్) తోపాటు ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

కేజీబీవీ ఓఎస్‌డీగా సరస్వతీబాయి

బాలానగర్ (రాజాపూర్), మార్చి 27: రాజాపూర్ కేజీబీవీ ఓఎస్‌డీగా బాలానగర్ బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం సరస్వతీబాయి నియమించినట్లు ఎంఈవో సుధాకర్ తెలిపారు. కేజీబీవీలో ఇటీవల చోటుచేసుకున్న వివాదాస్పద ఘటన నేపథ్యంలో ఉన్నతాధికారులు ఎస్‌వోను, ఓసీఆర్టీని బదిలీ చేశారు. సరస్వతీబాయిని ఓఎస్‌డీగా నియమిస్తూ డీఈవో ప్రవీణ్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు.

నేటి కాలంలో శోధన, పరిశోధన అవసరం

- పీయూ వైస్‌చాన్స్‌లర్ శ్రీనివాస్

జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న వీసీ శ్రీనివాస్

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, మార్చి 27: నేటి కాలంలో శోధన పరిశోధన చాలా అవసరమని పాలమూరు యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ జీఎన్.శ్రీనివాస్ అన్నారు. గురువారం పీయూ అకాడమిక్ బ్లాక్ ఆడిటోరియంలో బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో రీసెర్చ్ మెథడాలజీ, ప్రాజెక్టు వర్క్ గైడెన్స్ అనే అంశంపై ఏర్పాటు చేసిన రెండు రోజుల రాష్ట్రస్థాయి కార్యశాల (వర్క్‌షాప్)కు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గణాంక సాధనాలను ఉపయోగించడానికి చాలా కష్టపడి పనిచేయాల్సి ఉంటుంది.. ఇప్పుడు అందరూ పరిశోధనా పద్ధతిపై ఆటోమేషన్ సాధనాలపై ఆధారపడుతున్నారని తెలిపారు. అధ్యాపకులు నిత్య విద్యార్థులుగా కృత్రిమ మేధస్సులో పరిశోధనపై ఎక్కువ దృష్టి పెట్టాలని సూచించారు. పరిశోధనా పద్ధతి, ప్రాజెక్టు పని, మార్గదర్శకత్వంపై రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్న ఎంబీఏ విభాగం నిర్వాహణ విభాగాన్ని అభినందించారు. కార్యక్రమంలో కన్వీనర్ డా.ఎస్‌ఎన్.అర్జున్‌కుమార్, కోకన్వీనర్ జావిద్ మోహమ్మద్‌ఖాన్, డా.నాగసుధ, కోఆర్డినేటర్ అరుంధతీరెడ్డి, కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ కరుణాకర్‌రెడ్డి, ఫార్మసీ ప్రిన్సిపాల్ రవికాంత్, విజయ్, నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు రామ్మోహన్‌జీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి జాతీయ ఉపకారవేతనం

పాలమూరు యూనివర్సిటీలో సూక్ష్మ జీవశాస్త్ర విభాగంలో డా.శాంతిప్రియ అజ్మీర పర్యవేక్షణలో పీహెచ్‌డీ చేస్తున్న పరిశోధక విద్యార్థి ముడావత్ రవి జాతీయ ఉపకార వేతనానికి ఎంపికయ్యాడు. యూజీసీ, భారత ప్రభుత్వం (మినిస్ట్రీ ఆఫ్ ట్రైబల్ అఫైర్స్) ప్రతి ఏడాది మెరిట్ ఉన్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉన్నత విద్యను అభ్యసించడానికి జాతీయ ఉపకార వేతనం అందిస్తుంది. ఈ సందర్భంగా వీసీ విద్యార్థిని అభినందించారు. రీసెర్చ్‌లో మరింత ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు.

పీయూలో టీజీపీఈసెట్ కార్యాయం

రాష్ట్రవ్యాప్తంగా ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో అడ్మిషన్లకు ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహణ బాధ్యతను ఉన్నత విద్యామండలి పాలమూరు యూనివర్సిటీకి అప్పగించింది. ఈ నేపథ్యంలోనే గురువారం పీయూ క్యాంపస్‌లో ప్రత్యేక కార్యాలయం ప్రారంభించారు. టీజీపీఈసెట్ చైర్మన్‌గా పీయూ వీసీ జీఎన్.శ్రీనివాస్, కన్వీనర్‌గా ప్రొఫెసర్ దిలీప్‌కుమార్ వ్యవహరించనున్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ మధుసూదన్ రెడ్డి అసిస్టెంట్ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ రవీందర్, ఫిజికల్ డైరెక్టర్ డా.వై.శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై సీబీఐ విచారణ జరిపించాలి

జడ్చర్లలో నిరసన వ్యక్తం చేస్తున్న క్రిస్టియన్లు

జడ్చర్లటౌన్, మార్చి 27: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సీబీఐ విచారణ జరిపించాలని జడ్చర్ల యునైటెడ్ క్రిస్టియన్స్ సంఘం డిమాండ్ చేసింది. గురువారం జడ్చర్ల యునైటెడ్ క్రిస్టియన్స్ సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఎంబీ చర్చి నుంచి జడ్చర్ల తాసీల్దార్ కార్యాలయం వరకు శాంతిర్యాలీ నిర్వహించారు. పాస్టర్ ప్రవీణ్ పగడాల కుటుంబానికి న్యాయం చేయాలని నినాదాలు చేశారు. అనంతరం తాసీల్దార్ నర్సింగ్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడారు. పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై అనుమానం ఉందని, ఇది కచ్చితంగా హత్యగా భావిస్తున్నామన్నారు. ఈ ఘటనపై సీబీఐ విచారణ చేపట్టి బాధ్యులైన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ఫిలమోని, డానియేల్, జైపాల్, నిత్యానందం, లూథర్, తిమోతి, టైటస్, శశిధర్, మోజస్, సాగర్, డేవిడ్, రూబెన్, సాల్మన్,సందీప్, బన్నీ, సన్నీ, ఆశీర్వాదం, టోని, పాస్టర్లు విలియంబూ, ఏలియా, స్టీవెన్‌రాజ్, ఎలిషా, రాజ్‌పాల్, రత్నం తదితరులు పాల్గొన్నారు.

బాదేపల్లి సహకార సంఘం మహాజన సభ

జడ్చర్ల, మార్చి 27: బాదేపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మహాజన సభను గురువారం నిర్వహించారు. సంఘం చైర్మన్ సుదర్శన్ గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు తీర్మానాలను ఆమోదించినట్లు చైర్మన్ సుదర్శన్‌గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా 2024–25 సంవత్సరానికి సంబంధించిన వసూళ్లు, జమా ఖర్చులు సభ్యులను తెలిపారు. పాతబాకీలను వసూలు చేసి కొత్తవారికి రుణాలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. పాతబకాయిలు వసూలు చేయడంతో సంఘం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. పీఏసీసీఎస్ బలోపేతానికి కేంద్ర ప్రభుత్వం, నాబార్డు ద్వారా గిడ్డంగి నిర్మాణానికి రూ.1.47కోట్లు ఇచ్చారని ఆ డబ్బులతో నాగసాల శివారులో 2500మెట్రిక్ టన్నుల గిడ్డంగిని నిర్మించినట్లు తెలిపారు. దానికి అనుసంధానంగా రైస్‌మిల్లును ఏర్పాటు చేసేందుకు తీర్మానించారు. అదేవిధంగా అక్కడే సోలార్ విద్యుత్ కేంద్రం ఏర్పాటు చేస్తే సంఘం తెచ్చిన అప్పులకు కిస్తులు చెల్లించేందుకు ఆర్థికంగా ఉపయోగపడుతుందని తీర్మానం చేసి ఆమోదించారు. సహకార సంఘానికి కొత్తగా సభ్యత్వం తీసుకోవాలని సభ్యులు కోరారు. నూతనంగా సభ్యత్వం తీసుకొనేటుకు తీర్మానం చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, మాజీ పీఏసీసీఎస్ చైర్మన్ కాట్రపల్లి లక్ష్మయ్య, వైస్ చైర్మన్ సుధాకర్ రెడ్డి, డైరెక్టర్లు జీవన్‌గుండప్ప, నర్సింహారెడ్డి, చంద్రయ్య, హతీరాం, రామకృష్ణారెడ్డి, సురేందర్‌గౌడ్, సీఈవో యాదగిరి తదితరులు ఉన్నారు.

మల్లెబోయిన్‌పల్లిలో..

జడ్చర్ల మండలంలోని మల్లె బోయిన్‌పల్లి పీఏసీసీఎస్ మహాజన సభను గురువారం నిర్వహించారు. సంఘం చైర్మన్ మల్లేశ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో 2024–25సంవత్సరానికి సంబంధించిన జమా ఖర్చులను సభ్యులకు తెలిపారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలను సభ్యులు ఆమోదించారు.

'విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేయాలి'

మహ బూబ్‌నగర్, మార్చి 27: మహబూబ్‌నగర్ పట్టణంలో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నడుపుతున్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని, యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ దక్షిణ తెలంగాణ అధ్యక్షుడు మల్లె పోగు శ్రీనివాస్ మాదిగ డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళీ రాష్ట్ర నాయకుడు యాంకీ రమేశ్ మాదిగతో కలిసి పాఠశాలల పేర్లతో సహ ఫిర్యాదు చేశారు. పాలమూరు జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా మౌలిక సదుపాయాలు లేకుండా పాఠశాలలు నడుపుతున్నారని.. అట్టి వారిని గుర్తించి పాఠశాల గుర్తింపును రద్దు చేసి యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకొని నిరుపేద విద్యార్థులకు న్యాయం చేయాలని పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

బాధితుడిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల

దేవరకద్ర, మార్చి 27: మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యకర్త వెంకటేశ్ సోదరుడు ఇటీవల మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి గురువారం బాధితుడి ఇంటికెళ్లి ఆయన చిత్రపటానికి పూలమల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢసానుభూతి తెలిపారు. మాజీ ఎమ్మెల్యే వెంట బీఆర్‌ఎస్ మండల మాజీ అధ్యక్షుడు శ్రీకాంత్‌యాదవ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ దొబ్బలి ఆంజనేయులు, మాజీ ఎంపీటీసీ వెంకట్రాములు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

నియోజకవర్గ కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ ఉప్పల వెంకట్రాములుకు ఇటీవల గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్శిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నాడు. దీంతో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి గురువారం శాలువాతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు జెట్టి నర్సింహారెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి, దొబ్బలి ఆంజనేయులు, యుగేందర్ రెడ్డి, ఖాజా, నవీన్ గౌడ్ బాలరాజు ఉన్నారు.

ట్రాఫిక్ సిబ్బందికి కూల్ వాటర్ బాటిల్స్

సిబ్బందికి కూల్ వాటర్ బాటిల్స్ అందజేస్తున్న ఎస్పీ జానకి

మహ బూబ్‌నగర్, మార్చి 27: ప్రస్తుత వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని, రోడ్లపై విధులు నిర్వర్తించే ట్రాఫిక్ పోలీసు ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు సిబ్బందికి కూల్ వాటర్ బాటిల్స్, క్యాప్‌లు అందజేసినట్లు ఎస్పీ జానకి పేర్కొన్నారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ మాట్లాడుతూ.. వేసవిలో ఎండలు తీవ్రంగా ఉండడంతో రోడ్లపై నిరంతరం సేవలందించే ట్రాఫిక్ సిబ్బంది అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని.. వారికి తగిన రక్షణ కల్పించేందుకు వాటర్ బాటిల్స్, క్యాప్‌లు తక్షణ ఉపశమనం కలిగించడమే కాకుండా, డీహైడ్రేషన్ వంటి సమస్యలను నివారించడంలో సహాయపడుతుందన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ భగవంత్‌రెడ్డి, భూత్పూర్ సీఐ రామకృష్ణ, ట్రాఫిక్ ఎస్సై గోపాల్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఏఐని పరిశీలించిన రాష్ట్రస్థాయి బృందం

నారాయణపేటరూరల్, మార్చి27: మండలంలోని కొల్లంపల్లి, జాజాపూర్ గ్రామ ప్రాథమిక పాఠశాలలోని కంప్యూటర్ ఆధారిత ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌ను గురువారం రాష్ట్రస్థాయి బృందం సభ్యులు పరిశీలించారు. ఈ బృందం సభ్యులు అవంతి, శరణ్, ఆకాశ్ విద్యార్థుల గణితం, తెలుగు సామర్థ్యాలను పరిశీలించారు. పాఠశాల స్థాయిలో విద్యార్థులు కంప్యూటర్ నేర్చుకోవడంతో వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తుందని సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంవో విద్యాసాగర్, ఎంఈవో బాలాజీ, ఇన్‌చార్జి హెచ్‌ఎం బాలకిష్టప్ప, జీహెచ్‌ఎం పాల్గొన్నారు.

ఛత్రపతి విగ్రహ ఏర్పాటుకు గ్రహణం

నవాబ్‌పేట, మార్చి 27: మండలంలోని కాకర్లపహాడ్‌లో ఛత్రపతి శివాజీ విగ్రహ ప్రతిష్ఠాపనకు గ్రహణం పట్టింది. పది రోజుల కిందట గ్రామం నడిబొడ్డున రచ్చకట్ట వద్ద భూమిపూజ చేశారు. కాగా అక్కడ స్థలం తక్కువగా ఉందని, అదే గ్రామస్తులు కొంతమంది వ్యతిరేకిస్తున్నారు. ఈ క్రమంలోనే గురువారం ఎంపీడీవో జయరామ్‌నాయక్, ఎస్సై విక్రమ్ కాకర్లపహాడ్‌కు వెళ్లి గ్రామసభ నిర్వహించి అభిప్రాయాలు సేకరించారు. 80శాతం మంది రచ్చకట్ట వద్ద ఏర్పాటు చేయాలని వెల్లడించారు. కొంతమంది వేరే స్థలంలో పెట్టాలని తెలపడంతో ఇరు వర్గాల అభిప్రాయాలను విన్న అధికారులు గ్రామసభలో తెలిపిన వివరాల రిపోర్టును కలెక్టర్‌కు సమర్పిస్తామని వివరించారు. కార్యక్రమంలో అన్ని పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతుకలను అరెస్టు చేయడం కాంగ్రెస్ నైజం

మద్దూర్(కొత్తపల్లి), మార్చి 27: ప్రశ్నించే గొంతుకలను అరెస్టు చేయడం కాంగ్రెస్ నైజమని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు గోపాల్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులను గురువారం పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. కొడంగల్ నియోజకవర్గంలో ప్రజల తరఫున ప్రశ్నించే గొంతుకలుగా ఉన్న బీఆర్‌ఎస్ నాయకులను అసెంబ్లీ ముట్టడి అని ముందే భయపడి అరెస్ట్ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వం చేతగాని తనానికి నిదర్శనమన్నారు.

పోలీసుల అదుపులో బీఆర్‌ఎస్ నాయకులు

భూత్పూర్‌లో..

కాంగ్రెస్ పాలనలో అక్రమ అరెస్టులు

దేవరకద్ర రూరల్ (చిన్న చింతకుంట), మార్చి 27: కాంగ్రెస్ పరిపాలనలో అక్రమ అరెస్టుల పర్వం కొనసాగుతున్నదని సీసీకుంట సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు మోహన్ గౌడ్ అనారు. గురువారం అసెంబ్లీ ముట్టకి హైదరా బాద్‌వెళ్తున్న మాజీ సర్పంచ్‌లను స్థానిక పోలీసులు అరెస్టు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. పెండిగ్ బిల్లులు అడిగినందుకు అక్రమంగా అరెస్టులు చేస్తున్నారని వాపోయారు. తక్షణమే పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు సుప్రియరాము, సతీశ్, కాంతారావు, రవీందర్ రెడ్డి రఘువర్ధన్ గౌడ్, శివ శంకర్ గౌడ్ ఉన్నారు.

చిన్నచింతకుంటలో స్టేషన్‌కు తరలించిన పోలీసులు

భూత్పూర్ మండలంలో..

భూత్పూర్, మార్చి 27: మాజీ సర్పంచ్‌లను ముందస్తుగా అరెస్ట్‌చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు మాజీ సర్పంచ్ శేఖర్ అన్నారు. ఈ సందర్భంగా గురువారం అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో మాజీ సర్పంచ్‌లు ఆంజనేయులు, యాదయ్య, శ్రీనివాసులు ఉన్నారు.